# విస్తరణ లేక మూడో స్థానానికి..

- హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు పదేళ్లలో చర్యలు తీసుకోని ఫలితం
- మొదటి 2 స్థానాల్లో ఢిల్లీ, బెంగళూరు
- ఇప్పుడూ పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో 9వ స్థానానికి పడిపోవచ్చు
- రెండో దశ మెట్రోపై సీఎం ప్రత్యేక దృష్టి
- హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో ఏ మాత్రం విస్తరణ జరగకపోవడంతో హైదరాబాద్ మెట్రో దేశంలో రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయిందని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మొదటి స్థానంలో ఢిల్లీ (415 కిలోమీటర్లు), రెండో స్థానంలో బెంగళూరు (74 కిలోమీటర్లు) ఉన్నాయని చెప్పారు. అక్కడి ప్రభుత్వాలు చొరవ తీసుకోవడంతో మెట్రో విస్తరణ పెద్దఎత్తున జరిగిందన్నారు. మనవద్ద 69 కిలోమీటర్ల వరకే చేపట్టామని, విస్తరణ గురించి వెంటనే పట్టించుకోకుంటే 9వ స్థానానికి పడిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ప్రారంభించి ఏడేళ్లయిన సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి రసూల్‌పురాలోని మెట్రో భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో అన్ని ప్రాంతాలకు మెట్రో రైలును నడిపించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. మొదటి దశ సమయంలో మెట్రో వద్దని చాలామంది వ్యతిరేకించారని, ఇప్పుడు తమకంటే తమకు కావాలని పట్టుపడుతున్నారని తెలిపారు. మొదటి దశ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి రెండో దశ ప్రతిపాదనలను స్వయంగా సమీక్షించారని చెప్పారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు పదిసార్లు తమతో సమీక్షలు నిర్వహించారన్నారు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రపంచంలోనే విజయవంతంగా మెట్రోను నడిపిస్తున్న ఏకైక నగరంగా హైదరాబాద్ నిలుస్తుందన్నారు.

## కేంద్రానికి డీపీఆర్ సమర్పణ

రెండో దశలో 116.4 కిలోమీటర్ల మేర ఆరు కారిడార్లను ప్రతిపాదించామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. 6వ కారిడార్ (ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కి.మీ.) ప్రతిపాదనలు విడిగా రూపొందించామని, విగిలిన 5 కారిడార్ల (76.4కి.మీ.) పనుల డీపీఆర్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో నవంబరు 4న కేంద్రానికి సమర్పించామని చెప్పారు. రెండు నెలల్లోపు కేంద్రం నుంచి అనుమతి రావచ్చని తెలిపారు. రెండో దశలో రైళ్ల సగటు వేగం గంటకు 35 కిలోమీటర్లు ఉంటుందని, దీన్ని నాగోల్-ఎయిర్‌పోర్ట్ లైన్‌లో పెంచే అవకాశం ఉందన్నారు. ఈ మార్గంలో మొత్తం 24 స్టేషన్లను ప్రతిపాదించామని, వాటిలో 4 స్టేషన్లు తగ్గించి వేగం పెంచుతామన్నారు. ప్రారంభంలో 3 కోచ్‌లతో రైళ్లను నడిపిస్తామని, తర్వాత 6 కోచ్‌లకు పెంచుతామన్నారు. ఫేజ్-1 అనుభవంతో పార్కింగ్, బస్‌బేలు, ఆటోల కోసం స్టేషన్ల గ్రౌండ్ లెవెల్‌లో స్థలాలు సేకరిస్తామన్నారు. రెండో దశ విస్తరణలో కిలోమీటర్‌కు నిర్మాణ వ్యయం రూ.318 కోట్లుగా అంచనా వేశామని చెప్పారు. రెండో దశలో ప్రతిపాదించిన 5 కారిడార్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.7,313 కోట్లు (30%), కేంద్రం వాటా రూ.4,230 కోట్లు (18%) కాగా, మిగతా 48% అంటే రూ.11,693 కోట్లను కేంద్ర ప్రభుత్వం పూచీకత్తుతో జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ వంటి అంతర్జాతీయ బ్యాంకుల నుంచి రుణాలు సేకరిస్తున్నామని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. ఈ రుణాలపై 2% వడ్డీ ఉంటుందన్నారు. మిగతా 4% అంటే రూ.1,033 కోట్ల పెట్టుబడిని పీపీపీ విధానంలో సమకూర్చుకుంటామని తెలిపారు. మొదటి దశలో భారతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై వడ్డీ 9 నుంచి 10% ఉండడంతో నిర్మాణ సంస్థపై భారం పెరిగిందని చెప్పారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల పనులను జనవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. ఇక్కడ మార్కెట్ ధర గజానికి రూ.23 వేలు ఉందని, తాము రూ.65 వేలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

## అందుకే మేడ్చల్‌ను తీసుకోలేదు

ప్యారడైజ్-కండ్లకోయ/మేడ్చల్,జేబీఎస్-తూముకుంట/శామీర్‌పేట్ కారిడార్లలో 90% సరైన మార్గం లేకపోవడంతో రెండో దశ విస్తరణ కింద ప్రతిపాదనలు తీసుకోలేదని రెడ్డి తెలిపారు. స్థానికుల నుంచి డిమాండ్ పెరిగిన నేపథ్యం లో సీఎం అక్కడి ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారని చెప్పారు. మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో గంగారం వద్ద 1.6కి.మీ మేర మొదటి లెవల్‌లో ఫ్లై ఓవర్, రెండో లెవల్‌లో మెట్రో నిర్మిస్తామన్నారు. ఎల్‌బీనగర్-హయత్‌నగర్ మార్గంలో 5, 6 ఫ్లై ఓవర్ల నిర్మాణం జరుగుతోందన్నారు.

## 63.40 కోట్ల మంది ప్రయాణం

మొదటి దశ మెట్రో మూడు కారిడార్లలో 2017 నుంచి ఇప్పటివరకు 63.40 కోట్ల మంది ప్రయాణించారని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారన్నారు. రెండో దశను 2028లోగా పూర్తి చేస్తే రోజుకు 17లక్షల మంది వరకు ప్రయాణించే అవకాశం ఉందని చెప్పారు.